క్లుప్తంగా

చంద్ర రాజేశ్వరరావు ఆశయసాధనకు కృషి



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ: దున్నే వాడిదే భూమి అనే నినాదంతో పోరాటాలు నడిపించి, కార్మికులు కర్షకుల పక్షాన నిలబడిన చంద్ర రాజేశ్వరరావు గొప్ప యోధుడని సీపీఐ మధురవాడ ఏరియా నాయకుడు సత్యనారాయణ అన్నారు. ఆయన ఆశయసాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దివంగత చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని మధురవాడలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.అప్పారావు, మహేష్, రామకృష్ణ, షేక్ తానీస, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 64 మాలల జపయజ్ఞం

తగరపువలస: కామద ఏకాదశి సందర్భంగా ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో చైతన్యభవన్‌లో 64 మాలల జపయజ్ఞం నిర్వహించారు. ఉదయం 5.15 గంటల నుంచి 10 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు 32 మాలలు వంతున నిర్వహించారు. ప్రత్యక్షంగానే కాక ఆన్‌లైన్‌లోనూ పలువురు భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి మణికుమారి

పద్మనాభం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మణికుమారి సూచించారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా రేవిడి పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణి అయిన దగ్గర నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు నిండేంత వరకు ప్రతి రోజు ఆకుకూరలు, పండ్లు తినాలన్నారు. సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలు, మునగాకు, పాలు, గుడ్లు భుజించాలని తెలిపారు. పుట్టిన బిడ్డకు గంటలోగా తల్లి పాలు ఇవ్వాలన్నారు. రేవిడి సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, సూపర్ వైజర్ సతీష్, గర్భిణులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు అభినందన



ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు

తగరపువలస: ఏయూ పరిధిలోని డిగ్రీ మొదటి సంవత్సర ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటు అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 100 శాతం, బీఎస్సీ జువాలజీలో 96, మాథ్స్, కెమిస్ట్రీలో 90, బోటనీలో 95, బీఏ హిస్టరీలో 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం 10 పాయింట్లకు గాను బీకాం విద్యార్థిని లలిత 7.35, సత్తిబాబు 7.20, హేమలత 6.90, విష్ణువర్ధన్ 6.70, కె.అప్పల నరసమ్మ 6.50, జువాలజీలో మాణిక్యం 7.95, హరికృష్ణ 7.20, గురుమూర్తి 6.20 సాధించారన్నారు. కెమిస్ట్రీలో సుస్మిత 7.05, నీలిమ 6.60, మాథ్స్‌లో రాజబాబు 7.25, భగీరథ 6.50, బోటనీలో నవీన్ 6.45 పాయింట్లు సాధించారని తెలియజేశారు.

వృక్ష విలాపం

- మధురవాడలో ఇష్టానుసారం చెట్ల నరికివేత
- పర్యావరణానికి తీవ్ర విఘాతం
- విద్యుత్-జీవీఎంసీ అధికారుల సమన్వయం లోపం
- పట్టించుకోని హార్టికల్చర్ అధికారులు



పరదేశిపాలెం హైవేను ఆనుకుని ఓ ప్రైవేటు పరిశ్రమ వద్ద మోడుగా మిగిలిన చెట్టు





మధురవాడ జోనల్ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ భూమిలో ఇటీవల నరికి వేసిన భారీ చెట్లలో ఒక చెట్టు ఇలా..

మధురవాడ: పచ్చని చెట్లు నేలవాలుతున్నాయి. హుద్‌హుద్ తుఫాన్ నేర్పిన పాఠం, తర్వాత పర్యావరణంలో వచ్చిన తీవ్ర మార్పులను అధికార యంత్రాంగంతో పాటు కొందరు నగరవాసులు కూడా పెడచెవిని పెడుతున్నారు. దీనికి తోడు జీవీఎంసీ ఉద్యావన విభాగం–విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో మధురవాడలో పచ్చదనం ఆవిరైపోతుంది. ఎంతో విలువైన వృక్షాలు చాలా ప్రాంతాల్లో కనుమరుగైపోతున్నాయి. మరికొన్ని చోట్ల మోడుగా మిగిలిపోతున్నాయి. ఇదీ మధురవాడ జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లోని పరిస్థితి.

పర్యావరణ పరిరక్షణలో చెట్లు కీలకం. కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో పచ్చదనాన్ని పదిలంగా కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం అవుతుంది. కానీ కొందరు వ్యక్తుల స్వార్థపూరిత చర్యలతో పచ్చదనం కనుమరుగవుతోంది. దీంతో మధురవాడలోని వివిధ ప్రాంతాలలో చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికివేస్తున్నారు. కొద్దికాలంగా ఇలాంటి సంఘటనలు ఎదురవుతున్నా, 6 నెలల్లో ఇటువంటి ఫిర్యాదులు అందలేదని, ఒక్కరి నుంచి కూడా నయాపైసా వసూలు చేయలేదని అధికారులే సెలవిస్తున్నారు.



మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో మోడుగా మిగిలిన భారీ వృక్షం

నిదర్శనాలివి..

- కొన్నాళ్లక్రితం జీవీఎంసీ మధురవాడ జోనల్ ఆఫీసు ఎదురుగా, దేవదాయ శాఖ భూమిలో ఉన్న 4 భారీ వృక్షాలను కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతి లేకుండా నరికేశారు. ఇప్పటికీ వాటి కలప అక్కడ సజీవ సాక్ష్యంగా దర్శనం ఇస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ చెట్లు నిత్యం ఇక్కడికి వచ్చే ఎంతోమంది సందర్శకులకు నీడనిచ్చేవి. కార్యాలయం ఎదురుగా ఉన్న చెట్ల విషయమే అధికారులు పట్టించుకోకపోతే ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- మధురవాడలో చాలా ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల కిందనే చెట్లు ఉన్నాయి. నిర్వహణ పేరుతో చెట్లు నరకడానికి అనుమతి లేదు. కానీ, దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. కొమ్మలు తొలగించేటప్పుడు ఉద్యానవన శాఖతో సమన్వయం చేసుకోవాలి. అదీ ఎక్కడా ఆచరణలో కానరావడం లేదు. ఇష్టానుసారం పెద్ద పెద్ద చెట్లనే మోడుగా మార్చేస్తున్నారు.
- మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ, స్వతంత్రనగర్, రెవెన్యూ లే అవుట్ తదితర చోట్ల భారీ వృక్షాలతో నిత్యం ఆ ప్రాంతం ఎంతో చల్లగా ఉంటుంది. రోడ్లు వెంబడి భారీ వృక్షాలు దర్శనం ఇస్తుంటాయి. ఇలాంటి చోట కూడా కొందరు చెట్లు నరికేస్తున్నారు.
- హైవేను ఆనుకుని పరదేశిపాలెం, బోరవానిపాలెం, మారికవలస, శివశక్తినగర్ రోడ్డు తదితర చోట్ల దుకాణాలకు అడ్డంగా ఉండటం వంటి అనేక కారణాలతో చెట్లు నరికేస్తున్నారు.

ఇదీ పద్ధతి..

చెట్ల తొలగింపునకు చాలా వరకు అనుమతి లేదని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఎక్కడైనా అవసరం అయితే రీప్లేస్‌మెంట్‌కి అనుమతి ఇస్తారు. కొమ్మలు నరకాలన్నా జీవీఎంసీ అనుమతి పొందాలి. చెట్లు తొలగించాలంటే డీఎఫ్‌వో స్థాయి అధికారులే అనుమతి ఇవ్వాలి. పైగా పెద్ద ప్రక్రియ. అనుమతి ఇచ్చినా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత కూడా చూడాలి. ఇటువంటి వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై జీవీఎంసీ ఉద్యావనశాఖ అధికారి దామోదర్ వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన స్పందించలేదు.



మధురవాడ అయోధ్యనగర్ లే అవుట్‌లో ప్రభుత్వ భూమిలో నరికివేసిన చెట్టు

కొమ్మలు మాత్రమే తొలగించాలి

మధురవాడ జోన్‌లో గత 6 నెలల కాలంలో చెట్లు నరికిన సంఘటనలు మా దృష్టికి రాలేదు. చెట్లు నరకడానికి మేము ఎవ్వరికీ అనుమతి ఇవ్వం. ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకుంటే కొమ్మలు తొలగించడానికి మాత్రమే అనుమతి ఇస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో కూడా రీప్లేస్‌మెంట్‌కే ఎక్కువగా అనుమతి ఇస్తారు. చెట్టు కొట్టాలంటే డీఎఫ్‌వో అనుమతి పొందాల్సిందే.

– అర్చన, ఉద్యానవనశాఖఅధికారి, జీవీఎంసీ జోన్–2

గంభీరం గెడ్డవాగులో తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గెడ్డవాగును తవ్వి రాళ్లు, గ్రావెల్ తరలించిన దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 141లో అక్రమ తవ్వకందారులు గెడ్డవాగును తవ్వి గ్రావెల్, రాళ్లు తరలించుకుపోతున్నారు. ఇటీవల రాత్రికి రాత్రే సుమారు 500 గజాల గెడ్డను చదును చేసి, అక్కడ ఫెన్సింగ్ నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ప్రదేశంలో రాత్రిపగలు తేడా లేకుండా గ్రావెల్ తరలించుకుపోతుండంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో పాటు గ్రావెల్, రాళ్లకు మంచి డిమాండ్ ఉండటంతో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రభుత్వ భూములను వదలడం లేదు. నిత్యం మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుండటంతో పాటు గ్రావెల్‌కు రెక్కలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వీఆర్వో దగ్గర నుంచి తహసీల్దార్ వరకు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములతో పాటు అందులో ఉన్న విలువైన గ్రావెల్‌కు, రాళ్లకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

1085 మంది దివీస్ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దివీస్ ఉద్యోగులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 1085 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. జనరల్ మేనేజర్ దివి సత్యచంద్ర జ్ఞాపకార్థం వరుసగా 12వ ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు వైస్ ప్రెసిడెంట్ ఎల్వీ రమణ తెలిపారు. ఏటా వెయ్యి మందికి పైగా తమ ఉద్యోగులు రక్తదానం చేస్తున్నారన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రెడ్ క్రాస్, లైఫ్‌షేర్, ఎన్టీఆర్, రోటరీ, న్యూలైఫ్, ఏఎస్ రాజా, విశాఖ, ఎస్వీఎస్ బ్లడ్ బ్యాంకు సంస్థలు ఉద్యోగుల నుంచి రక్తం సేకరించారు. దివీస్ యాజమాన్యం మాట్లాడుతూ ఇలా సేకరించిన రక్తం అత్యవసర పరిస్థితులలో పేదవారికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎస్.దేవేందరరావు, జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, రమేష్‌బాబు, రామకృష్ణ, నాగార్జున, డీజీఎం పి.ప్రభాకర్, సంస్థ ప్రతినిధులు మహేంద్ర, మల్లికార్జున, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించకుండానే 15 ఏళ్లు

సంగివలసలో శిథిలమైన ప్రజా మరుగుదొడ్లు



సంగివలస శివాలయం వెనుక ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయిలెట్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలసలో ప్రజా మరుగుదొడ్లు ప్రారంభానికి ముందే శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇక్కడ 15 ఏళ్ల క్రితం స్థానికులను బహిరంగ మల విసర్జనకు దూరం చేయాలని, మున్సిపాల్టీ ప్రహరీతో పాటు పబ్లిక్ టాయిలెట్లు నిర్మించింది. పైన వాటర్ ట్యాంకు, పక్కన కుండీలు నిర్మించారు గానీ, కుళాయి కనెక్షన్ ఇవ్వడం మరచిపోయారు. దీంతో అవి ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలమైపోయాయి. తలుపులు, ద్వారబంధాలు, విద్యుత్ ఉపకరణాలు ఎత్తుకుపోయారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ పబ్లిక్ టాయిలెట్లు అడవిని తలపిస్తున్నాయి. చీకటి పడిన తరువాత ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నందున ఆందోళన చెందుతున్నారు. వీటిని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. లేదా వీటిని కూల్చి ఇతర ప్రజోపయోగకరమైన పనులకు ఈ స్థలాన్ని వినియోగించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డు, పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ సకరయ్య బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, చిలుకూరి లే అవుట్, పెద ఉప్పాడ, చిన ఉప్పాడ, గంగడిపాలెం, చేపలదిబ్బడిపాలెం, గోవుపేట, పాత్తూరు, కొత్తూరు, నేరెళ్లవలస, నేరెళ్లవలస కాలనీ, బోయిలూరు తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అన్నవరం ఫీడర్ పరిధిలో రేపు..

తగరపువలస: భీమిలి మండలం 11 కేవీ అన్నవరం ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా అన్నవరం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం, ఆశిపాలెం, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా, కరాటే శిక్షణ

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న జేజే పవర్ జిమ్ వద్ద ఉచిత యోగా, కరాటే శిబిరం నిర్వహించనున్నట్టు జిమ్ నిర్వాహకుడు నల్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని, 16 సంవత్సరాల లోపు బాల, బాలికలు ఇందులో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 98660 30880 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

నబ్బువరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఇంటర్ ఫస్టియర్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఆధార్ కార్డ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలన్నారు. పరీక్షకు కనీసం అరగంట ముందుగా హాజరుకావాలన్నారు.

ముందుకు వచ్చిన సముద్రం

నిలిచిన బోటు షికారు



రుషికొండ వద్ద ముందుకు వచ్చిన సముద్రం

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వద్ద బుధవారం సముద్రం భారీ కెరటాలతో ముందుకు చొచ్చుకుని వచ్చింది. మత్స్యకారులు తీరం వద్ద ఉంచిన పడవలను, టూరిజం బోట్లను కెరటాలు తాకడంతో పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. వాతావరణ మార్పుల వలన సముద్రంలో బలమైన ఈదురు గాలులుతో పాటు కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో మత్స్యకారులు అప్రమత్తమై బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సాధారణ రోజుల కంటే బుధవారం సముద్రం బాగా ముందుకు వచ్చిందని ఇక్కడ మత్స్యకారులు తెలిపారు. ఇక్కడ నిర్వహిస్తున్న బోటు షికారును వాతావరణం ప్రతికూలంగా మారడంతో ప్రస్తుతం నిలిపివేశారు. రెండు టూరిజం బోట్లను, నాలుగు ప్రైవేటు బోట్లను తీరానికే పరిమితం చేశారు.

దబ్బందలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు



దబ్బందలో ఏర్పాటు చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బందలో ఎట్టకేలకు బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభమయ్యాయి. కొండల మధ్య మారుమూల ఉన్న ఈ గ్రామంలో ఏళ్ల తరబడి సెల్‌ఫోన్ సేవలు లేకుండా పోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దబ్బందతో పాటు భీమిలి నియోజకవర్గంలో గిడిజాల, దాకమర్రి, రెడ్డిపల్లి, పద్మనాభం, కుసులవాడ తదితర ప్రాంతాలలో మెరుగైన సేవల కోసం అదనంగా సెల్‌టవర్లు ఏర్పాటు చేసి 4జి సేవలు ప్రారంభించారు. దబ్బంద గ్రామంలో కొండ పోరంబోకు స్థలాల వద్ద సెల్‌టవర్లు, కేబుల్ వైర్లు వేయాలని స్థానికులు కలెక్టర్, ఆనందపురం తహసీల్దార్లకు పీజీఆర్ఎస్‌లో పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. ఇటీవల దబ్బందలో రెండు చోట్ల సెల్‌టవర్ల నిర్మాణం పూర్తి కావడమే కాకుండా ఇప్పుడు గ్రామంలో సెల్‌ఫోన్‌లు మోగుతుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ సిబ్బంది మాట్లాడుతూ దబ్బంద గ్రామంలోనూ 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

సామాన్యులపై గుది 'బండ'

గ్యాస్ ధరల పెంపుపై మహిళల వినూత్న నిరసన



గ్యాస్ బండలు మోస్తూ నిరసన తెలుపుతున్న మహిళా సంఘం నాయకులు

మధురవాడ: వంట గ్యాస్ సామాన్యుల పాలిట గుదిబండలా మారిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వంట గ్యాస్‌పై పెంచిన రూ.50 వెంటనే రద్దు చేయాలని మధురవాడ సీపీఐ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం మధురవాడ హైవే సర్వీసు రోడ్డులో గ్యాస్ బండలు మోస్తూ, పెంచిన ధరలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా సంఘం నాయకురాలు ఎంఏ బేగం మాట్లాడుతూ గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం భారం వేయడం సరికాదన్నారు. మోదీ ప్రభుత్వం బ్యాంకుల్లో రుణాలు పొందిన వారి వడ్డీలు మాఫీ చేస్తూ, కూలినాలి చేస్తూ జీవిస్తున్న వారిపై గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల భారాలు పెంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లకార్డులు, జెండాలు పట్టుకుని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకులు వి.లక్ష్మి, సీపీఐ నాయకులు రాము, తిరుపతిరావు, షేక్ తనీస, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఇలా.. ఆటలెలా?

- తుప్పు పట్టిన పరికరాలు
- దెబ్బ తిన్న ఊయల
- ప్రమాదకరంగా రుషికొండ బీచ్ చిల్డ్రన్స్ పార్కు



చిన్నారుల ఉయ్యాల పరిస్థితి



తుప్పు పట్టిన జిమ్ పరికరాలు



ప్రమాదకరంగా ఉన్న జారుడుబల్ల

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో చిల్డ్రన్స్ పార్కు ప్రమాదకరంగా ఉంది. ఈ పార్కులో అన్ని పరికరాలు పూర్తి స్థాయిలో తుప్పు పట్టి ఉన్నాయి. జారుడు బల్ల సగం తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. చిన్నారులు ఊగే ఊయల దెబ్బ తింది. పిల్లలు ఆడుకునే పలు పరికరాలు తుప్పు పట్టి కూలే పరిస్థితిలో ఉన్నాయి. ఇదే ప్రాంతంలో ఉన్న జిమ్ పరికరాల పరిస్థితీ ఇలానే ఉంది. అన్నీ తుప్పు పట్టి, దెబ్బతిన్నాయి. ఇటీవల బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణ కోసం తాత్కాలికంగా పెయింటింగ్ వేసినా ఈ తుప్పు మాత్రం వదలలేదు. సంబంధిత అధికారులు స్పందించి, నూతన పరికరాలు ఏర్పాటు చేసి చిల్డ్రన్స్ పార్కును, ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.